

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (ఆదివారం)
కనిష్ఠం : 26.0

1100 డయల్ చేసినా ఫిర్యాదులు నమోదు

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు 1100 మీ కోసం కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే.. ఫిర్యాదు నమోదు..అర్జీస్థితిగతులు తెలుసుకో వచ్చని తెలిపారు.జిల్లాలో డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.సత్వర పౌర సేవలకు ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నెంబరు 95523 00009ను తమ సెల్ ఫోన్‌లో నిక్షిప్తం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీటితీరువా తదితర పన్నుల చెల్లింపులు కూడా వాట్సాప్ గవర్నెర్స్ ద్వారా చెల్లించే అవకాశం ఉంద న్నారు. రెవెన్యూ పరమైన సేవలు అందుబాటులోకి రావడం వల్ల అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండానే మీ మొబైల్ ఫోనుకే ఆయా సేవలు అందుబాటులోకి తీసుకురావడం విశేషమన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నిమిషం ఆలస్యమైనా నో

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

రాజమహేంద్రవరం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.37 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2-30 నుంచి 5-30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 16 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆర్ఐవో ఎన్.ఎస్.వి.ఎల్. నరసింహం తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. మొత్తం 20,466 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, అత్యవసర మందులు వంటి సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షాకేంద్రంలోకి అనుమతించమని, అర గంట ముందుగా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సూపర్.. 6



కూటమిలో పదవుల పండగ

- ఉమ్మడి జిల్లాకు ఒకేసారి ఆరు పదవులు
- నామినేటెడ్ పదవులు పంపకం
- రాష్ట్రస్థాయి చైర్మన్లుగా నలుగురు
- డీసీసీబీ, డీసీఎంఎస్‌కు ఇద్దరు
- ఎట్టకేలకు వీడిన ఉత్కంఠ
- ఫలించిన ఎదురుచూపులు
- టీడీపీకి 3, జనసేనకు 2, బీజేపీకి 1

ఎదురుచూపులు ఫలించాయి..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆరుగురు నాయకులను నామినేటెడ్ పదవులు వరించాయి. దీంతో ఇప్పటి వరకూ నామినేటెడ్ పదవులపై ఏర్పడిన ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి కేఎస్ జవహర్ నియమితులయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును వరించింది. రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ చైర్మన్ పదవి మండపేటకు చెందిన జనసేన నాయకుడు వేగుళ్ల లీలాకృష్ణను వరించింది. ఇక రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి రంపచోడవరానికి చెందిన చోళ్ల బొజ్జిరెడ్డి (బీజేపీ) నియమితులయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరించింది. తుమ్మల బాబు ప్రస్తుతం కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడిగా ఉన్నారు. తాజా పదవితో తుమ్మలకు మూడు పదవులు వరించినట్లయింది.అటు డీసీఎంస్ చైర్మన్‌గా కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పెచ్చెట్టి చంద్రమౌళికి కేటాయించారు. ఒకేసారి ఆరు పదవులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించడంతో సూపర్ సిక్స్ అంటూ కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కేఎస్ జవహర్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న జవహర్ అనూహ్యంగా 2014లో కొవ్వూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014 నుంచి 2019 వరకు కొవ్వూరు ఎమ్మెల్యేగా, ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేశారు.తదనంతర పరిణామాలతో కొవ్వూరు నుంచి తిరువూరు వెళ్లా రు.2019లో తిరువూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించినా దక్క లేదు.దీంతో పోటీకి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జవహర్ తనయుడు కొత్తపల్లి లాల్ టీడీపీ యువజన విభాగం కార్యదర్శిగా,రాజానగరం నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నారు.ఈ పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

సమసమాజ స్థాపనకు కృషి

సామాజిక న్యాయం అందించడానికి.. సమసమాజ స్థాపనకు కృషి చేస్తా. పీ4 విధానంలో దళితుల అభివృద్ధికి సాధ్యమవుతుందని ఆశిస్తున్నా. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు.
- జవహర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్

ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్‌గా శేషారావు

ఉండ్రాజవరం/నిడదవోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) చైర్మన్‌గా పదవి లభించింది. ప్రభుత్వం ఆదివారం వివిధ కార్పొరేషన్లకు ప్రకటించిన పదవుల్లో శేషారావుకు ఈ పదవి దక్కింది. ఈయన 1965వ సంవత్సరం జూలై 15న వేలివెన్నులో జన్మించారు. బీఏ చదివారు. తొలుత టీడీపీ ఉండ్రాజవరం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 1995లో వేలివెన్ను ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటి సర్పంచ్ ఆరేపల్లి వెంకట్రావు పదవిలో ఉండగా మరణించడంతో శేషారావు ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా కొనసాగారు. 2000 నుంచి 2009 వరకు సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు విజయం సాధించి గ్రామాభివృద్ధికి కృషి చేసారు. 2009లో సర్పంచ్‌గా పదవిలో ఉండగా నిడదవోలు నియోజకవర్గం కొత్తగా ఏర్పడింది. నాడు తొలిసారి నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధిం చి శాసనసభలో అడుగుపెట్టారు. రెండోసారి 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మూడో సారి ఓటమి చెందారు.అప్పటి నుంచి నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఈ పదవి రావడం పట్ల నియోజవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు శేషారావుకు అభినందనలు తెలిపారు.

సంతోషంగా ఉంది..

పార్టీ ఇచ్చిన పదవిని అంకిత భావంతో నిర్వహిస్తా. ఏపీ ఎస్ఎస్‌డీసీ చైర్మన్ పదవి రావడం సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు , సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు.
- బూరుగుపల్లి శేషారావు, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి

రంపచోడవరం, మే 11(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగపరంగా జ్యుడీషియల్ అధికారాలు కలిగిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత చోళ్ల బొజ్జిరెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం బోలగొండలో కొండరెడ్డి తెగకు చెందిన ఈయన గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయుడిగా తన కెరీర్ ప్రారంభించారు.ఆర్ఎస్ఎస్‌లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామాచేసి 2009 ఎన్నికల్లో బీజేపీ తరపున రంపచోడవరం నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు.అనంతరం బీజేపీలో కీలకంగా ఉంటూ ప్రస్తుతం అల్లూజిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని బొజ్జిరెడ్డికి కేటాయించారు.

సమస్యలు పరిష్కరిస్తా..

గిరిజన హక్కుల పరిరక్షణకు పాటు పడతా.. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి సాగిస్తా.ఈ పదవిని అప్పగించి నందుకు ప్రధాని మోదీ , పురందేశ్వరి, సీఎం చంద్ర బాబుకు కృతజ్ఞతలు.
- చోళ్ల బొజ్జిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్

ఏపీఎస్ఐడీసీ చైర్మన్‌గా లీలాకృష్ణ

మండపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆశలు ఫలించాయి. ఎదురుచూపులకు ఫలితం దక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామానికి చెందిన మండపేట నియోజకవర్గ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది.వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఇంటర్ చదివారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.తొలుత కాంగ్రెస్‌లో ఉన్నారు. 1995-2004 వరకు వల్లూరు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు.రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా 2000 నుంచి 2007 వరకు,పీసీసీ కార్యదర్శిగా 2011 నుంచి 2014 వరకు, మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా 2009 నుంచి 2014 వరకు పనిచేశారు. 2015- 2019 వరకు మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా కొనసాగారు. 2019లో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు.2019లో మండపేట నియో జకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా ఉన్నారు.ముందుగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర సాగు నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం నియమించింది.

సాగునీటి పారుదల అభివృద్ధికి కృషి

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు.నాపై ఎంతో నమ్మ కంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తా.సాగునీరు సరఫరాపై దృష్టి పెడతా. సాగునీటి వ్యవస్థలో మార్పులు చేర్పులపై నిపుణులతో చర్చించి చర్యలు తీసుకుంటా .
- లీలాకృష్ణ, ఏపీఎస్ఐడీసీ చైర్మన్

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరించింది. తొలుత డీసీసీబీ చైర్మన్ పదవికి పిఠాపురం జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినిపించింది.ఆఖర్లో అనుహ్యంగా ఈయనకు పదవి దక్కలేదు. అయి తే ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్‌లాంటి పెద్ద పదవిని మర్రెడ్డి చేపట్టలేరనే వాదన ప్రధానంగా పార్టీ అధినేత వద్ద వ్యక్తమైందని సమాచారం.దీంతో మర్రెడ్డికి అవకాశం చేజారిపోయినట్లయిందని పలువురు జనసేన నేతలు విశ్లేషించారు. అదే సమయంలో కౌడా చైర్మన్ తుమ్మలబాబును పిలిపించి ప్రస్తు తం డీసీసీబీ వందల కోట్ల అప్పుల్లో ఉన్నందున దీన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన విషయాన్ని వివరించి ఈయన పేరును ఖాయం చేసినట్లయింది. ఇదిలాఉంటే తుమ్మలబాబుకు తాజా కుర్చీతో కలిపి మొత్తం మూడు పదవులు చేతిలో ఉండడంపై జనసేన వర్గాలే విస్తుపోతున్నాయి. త్వరలో కౌడా కు కొత్త నేతను ఎంపిక చేస్తారని సమా చారం.కౌడా చైర్మన్ కుర్చీ టీడీపీకి ఇవ్వవచ్చనే ప్రచారం ఇరుపార్టీల్లో వ్యక్తమవుతోంది.

బాధ్యతగా చేస్తా

ఈ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తా. పార్టీ అధిష్టానం ఉంచిన గురుతర బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించగలననే నమ్మకం, విశ్వాసం ఉంది.
- తుమ్మల బాబు

డీసీఎంఎస్ చైర్మన్‌గా చంద్రమౌళి

అమలాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెనుకబడి సామాజికవర్గానికి చెందిన ఆయన్ను ఈ పదవిలో నియమించడం ద్వారా కోనసీమ జిల్లాలోని బీసీ సామాజికవర్గానికి న్యాయం చేసినట్టయింది.చంద్రమౌళి 1964 ఆగస్టు 27న జన్మించారు. బీఏ చదివిన ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి గ్రామ, మండల, ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పదవులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా బీసీసెల్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాలు, ఆ తరువాత రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పలు పర్యాయాలు సేవలందించారు.అల్లవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా మౌళి పనిచేసి టీడీపీ కి విశిష్ట సేవలందించారు. చంద్రమౌళికి బీసీ కోటాలో డీసీఎంఎస్ పదవిని కేటాయించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.ఉమ్మడి జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులతో పాటు మార్కెటింగ్ కార్యకలాపాల ద్వారా వారికి ఉన్నతమైన సేవలను అందించడమే లక్ష్యమని డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి వెల్లడించారు. డీసీఎంఎస్ ఆస్తుల పరిరక్షణ, రైతులకు సేవ అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.



ఊరేగిన సత్యదేవుడు

అన్నవరంలో ఆదివారం సత్యదేవుడి రథోత్సవం కన్నుల పండువగా సాగింది.. రథంపై ఊరేగుతున్న రత్నగిరివాసుడిని చూసి తరించేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు.. - వివరాలు 7లో

జనంతో మమేకం.. సమస్యలపై చర్చ

ఈ నెల 21 నుంచి 23 వరకూ అధికారుల పల్లె నిద్ర

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చే పథకాలు.. గ్రామాలు,పట్టణాలను తీర్చిదిద్దే కార్యక్రమాలకు రూపకల్పన చేయడంతో పాటు వేగంగా అమల్లోకి తీసుకొస్తున్నారు. దీనిలో భాగమే 'స్వర్ణాంధ్ర సంకల్పం'. ఈ సంకల్పంలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా 'పీపుల్స్ ఫస్ట్(జనమే ప్రధానం)' అనే కార్యక్రమాన్ని తొలిసారిగా రాష్ట్రంలో మొదలు ఆరంభిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని, ప్రజల స్థితిగతులను తెలుసుకోడానికి విడతల వారీగా అన్ని గ్రా మాలు,పట్టణాలకు రాష్ట్ర స్థాయి సీనియర్ అధికారులను ప్రభుత్వం పంపించనుంది.అనంతరం పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక ద్వారా సమస్యలకు పరిష్కారం చూపాలని సంకల్పించింది. 'పీపుల్స్ ఫస్ట్'లో భాగంగా తూర్పు గోదావరిలో తొలి విడతగా 20 గ్రామాలను కలెక్టరు ఎంపిక చేసి ఈ నెల 7న ప్రభుత్వానికి ప్రాథమిక జాబితా పంపించారు. ఈ మేరకు ప్రభుత్వం ఆ గ్రామాల స్థితిగతులను పరిశీలన చేసి అంగీకారం తెలుపుతుంది. అనంతరం ఈ నెల 21 నుంచి 23 వరకూ.. అంటే మూడు పగళ్లు, రెండు రాత్రుళ్లు ఆయా గ్రామాల్లో అఖిల భారత సర్వీసుకు

జిల్లాలో 20 గ్రామాలు ఎంపిక

చెందిన అధికారులు, రాష్ట్ర స్థాయిలో శాఖాధిపతులు బస చేస్తారు. ప్రజలతో మమేకమవుతారు. ఆయా సచివాలయాల పరిధిలో విస్తృతంగా పరిశీలన చేస్తారు. మౌలిక సదుపాయాలు గమనిస్తారు. అక్కడి సమస్యలు, ప్రజల ఇబ్బందులపై చర్చలు నడుస్తాయి. అనంతరం వాస్తవ పరిస్థితులను వారు ప్రభుత్వానికి నివేదిస్తారు.ఈ మేరకు కలెక్టర్లకు ఈ నెల 6న ఆదేశాలు అందాయి. జిల్లాలో తొలి విడతలో మండలానికి ఒకటి చొప్పున గ్రామాలను ప్రాథమికంగా ఎంపిక చేశారు. జిల్లాలో 20 సచివాలయాలు ఉన్నాయి.అనపర్తి మండలం రామవరం, బిక్కవోలు-కొమరిపాలెం2, చాగల్లు- నేలటూరు, దేవరపల్లి-లక్ష్మీపురం, గోకవరం -కృష్ణునిపాలెం(కొత్తూరు, చిన్నూరు, వెంకటాపురం, రామానుజపురం-గిరిజన గ్రామాలు), గోపాలపురం-జగన్నాథపురం, కడియం-కడియం4, కోరుకొండ-కనుపూరు, కొవ్వూరు రూరల్-చిడిపి, కొవ్వూరు అర్బన్- ఆవులవారి వీధి, నల్లజర్ల-తెలికిచర్ల, నిడదవోలు-పురుషోత్తపల్లి, పెరవలి-పెరవలి1, రాజమండ్రి రూరల్ -తొర్రేడు, అర్బన్- బత్తిన నగర్, రాజానగరం -తోకాడ2,రంగంపేట- చండ్రేడు, సీతానగరం-చినకొండేపూడి, తాళ్లపూడి-మలకపల్లి, ఉండ్రాజవరం-కాల్దరి గ్రామాలు ఉన్నాయి.

కల్తీ ఏంటీ

మార్కెట్‌లో నకిలీ టీపొడి

ఉదయం లేవడంతోనే ఒక టీ పడాల్సిందే.. లేదంటే తెల్లారదు.. ముఖంలో ఆ అలసట కనిపిస్తూనే ఉంటుంది.. ఒక చుక్క పడితే.. ఆ ఛాయ్ చమక్కులే చూడరా బాయ్ అని చిరంజీవి అన్నట్టు ఉంటుంది.. డిమాండ్ ఉండడంతో వీధికో టీ దుకాణం వెలసింది.. ఒక్క రాజమ హేంద్రవరంలోనే ప్రతి రోజూ సుమారు 6 లక్షల మంది టీ తాగుతున్నట్టు సమాచారం.. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లెక్కకు మిక్కిలి ఉంటుంది.. అయితే డిమాండ్‌కు తగినట్టు నకిలీ టీపొడి విచ్చల విడిగా వినియో గిస్తున్నారు. అయినా పట్టించుకునేవారే లేరు.





- విచ్చలవిడిగా అమ్మకాలు
- కేజీ రూ.200 మాత్రమే
- చిరు టీస్టాల్స్‌లో వినియోగం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- కన్నెత్తి చూడని అధికారులు
- రాజమండ్రిలో 9 పాయింట్లు

రాజమహేంద్రవరం సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ వ్యాపారం ఎక్కడ చేయగలరు.. ఎక్కడ ఎక్కువ అమ్మకాలు జరుగుతాయో అక్కడే..ఎందుకంటే అంతా సందట్లో సడేమియా.. ఏం చేసినా తిరుగుండదు..అడిగే దిక్కుండదు. తెలిసినా ఊకొడతారు..ఊరుకుంటారు..ప్రస్తుతం రాజమహేంద్రవరంలో అదే జరుగుతుంది. కల్తీ టీ పొడికి అడ్డాగా మారిపోయింది. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో ప్రధాన వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరం..నిత్యం కోట్లలో వ్యాపారలావాదేవీలు సాగుతాయి.కనీసం కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. దీంతో నకిలీ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.



రాజమహేంద్రవరంలో నకిలీ టీపొడి

ప్రధాన వాణిజ్య కేంద్రంలో..

రాజమహేంద్రవరం హోల్‌సేల్ వ్యాపారానికి ప్రసిద్ధి.మార్కెట్‌పై వ్యాపారులకు చాలా నమ్మకం.ఇదే పెట్టుబడిగా కొంత మంది కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెట్‌లోకి దింపి పెద్ద ఎత్తున విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం కల్తీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది. క్షణాల్లో తయారు చేసి ప్యాకింగ్ చేసి ఎటువంటి అనుమానం రాకుండా తరలించేస్తున్నారు.రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో మూడు, ఎస్‌వీజీ మార్కెట్‌లో 6 పాయింట్లలో కల్తీ టీ పొడి తయారు చేసి విక్రయిస్తున్నారు. కల్తీ వ్యాపారం యథేచ్ఛగా సాగుతుంది. సాధారణంగా ఒరిజినల్ టీపొడి ప్యాకెట్ 250 గ్రా ములు కొనాలంటే రూ.200 నుంచి రూ.260 మధ్య ఉంటుంది.కేజీ టీపొడి కొనాలంటే రూ.600 పైనే ఉంటుంది.కల్తీ టీపొడి రూ.150 నుంచి రూ.200 లోపే వస్తుంది. అంతే కాకుండా చిన్న రూ.5 ప్యాకెట్లు అధికంగా తయారు చేసి మార్కెట్‌లోకి దింపుతున్నారు.ప్రజలు నాణ్యత చూడకపోవడం కూడా కల్తీకి కారణం.కల్తీ టీపొడి నియంత్రణలో అధికారులు విఫలమవుతున్నారు.

కల్తీ టీపొడి తయారీ ఇలా

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి చింతపిక్కలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటు న్నారు. వాటిని ఎండబెట్టి టీ పొడి మాదిరిగా ఆడిస్తున్నారు.దానికి జీడీపప్పు పిక్క లోపల ఎర్రని చారతో ఉండే పొరను తీసుకుని దానిని పిండిలా ఆడిస్తున్నారు.అనంతరం ఫుడ్ కలర్స్ కలిపి ఈ మిశ్రమాన్ని చింతపిక్కల పౌడర్‌లో కలిపి వేడిచేసి గచ్చుపై ఆరబెట్టి ఆరిన తర్వాత టీ పొడి ప్యాకెట్లు తయారుచేస్తున్నారు. ఇందులో కలిపే ఫుడ్ కలర్స్, జీడిపిక్కల పొర కారణంగా జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది.ఈ టీ పొడితో కాచిన టీ తాగితే ఖచ్చితంగా జబ్బుపడతారు. ప్రస్తుతం ఈ కల్తీ టీ పొడి తయారీకి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉంది.గతంలో అనపర్తిలో తయారుచేస్తే అప్పటిలో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుట్టుచప్పుడు కాకుం డా నకిలీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది.

వీధికో దుకాణం..

టీస్టాల్స్‌కు కొదువలేదు.. ఉమ్మడి జిల్లాలో ఏ వీధిలో చూసినా ఏదో ఒక మూల టీస్టాల్ కనిపిస్తూనే ఉంటుంది.చాలా టీస్టాల్స్‌లో కల్తీ టీ పొడి వినియోగిస్తున్నారు.ఈ టీ పొడికి కాస్త అల్లం, యాలకుల పొడి తగిలించి సువాసనతో అందించేస్తున్నారు.మంచి రంగు కనిపించడంతో అది కల్తీ అనే సంగతే అంతుపట్టడంలేదు. అప్పుడప్పుడు సంబంధిత అధికారులు,ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు చేసి ఫైన్ వేసినా పెద్దగా పట్టించుకోవడంలేదు. ఫైన్లు కట్టేసి నెమ్మదిగా మళ్లీ కల్తీ టీపొడి తయారు చేసుకుని ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు.కల్తీ టీపొడి పట్టుకున్నప్పుడు వారి వ్యాపార లైసెన్సులు రద్దుతో పాటు వారిపై చట్టప్రకారం కఠిన శిక్షలు లేకపోవడం వల్ల అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు స్పందించి నిఘా పెడితే కల్తీ వ్యాపారాలకు చెక్ పడే అవకాశం ఉంది.

అశేష భక్తజనమయం...
సత్యదేవుని రథోత్సవం



రథోత్సవ సేవను ప్రారంభిస్తున్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్



రథోత్సవంలో భక్తులు

అన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాల్లో నిర్వహించే గ్రామసేవల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవం కనుల పండుగగా జరిగింది. సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను రూ.1.20 కోట్లతో తయారుచేయించిన నూతన టేకురథంపై ఆశీనులు గావించారు. చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు టెంకాయి కొట్టి రథోత్సవం ప్రారంభించారు. రథానికి కుంభం పోసి ముందుకు కదిలించారు. తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆంధ్రాబ్యాంక్ వరకు వెళ్లి అక్కడ నుంచి సత్యదేవుడి కొండపైకి వెళ్లే టోల్ గేట్ వరకు కొనసాగి తిరిగి కాంప్లెక్స్ వద్ద నూతనంగా ప్రారంభించిన రథశాల వద్ద ముగిసింది. అశేష భక్తజనంతో అన్నవరం మెయిన్‌రోడ్డు జనసందోహాన్ని తలపించింది. దేవస్థానం ఉద్యోగులు యావన్మంది రథోత్సవంలో పాల్గొనాలని ఈవో ఆదేశాలు జారీచేయడంతో ప్రతిఒక్క ఉద్యోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 3500 కిలోల బరువుతో సుమారు 35 అడుగులుపొడవు కలిగిన ఈ రథం లాగేందుకు సుమారు 50 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, నాయీబ్రాహ్మణులు 50మందితో పాటుగా ముందుభాగంలో ట్రాక్టర్, వెనకభాగంలో జెసీబీ సాయంతో ఇబ్బంది లేకుండా ముందుకు కదిలించారు. ఈఈ రామకృష్ణ, ఏఈవో కొండలరావు మైక్ ద్వారా సూచనలిస్తూ కార్యక్రమం కొనసాగించారు. వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు పర్యవేక్షణలో సుమారు 50మంది బందోబస్తు నిర్వహించారు.

నయనానందకరంగా వనవిహారం

సత్యదేవుడి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం వనవిహార మహోత్సవం నయనానందకరంగా జరిగింది. నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి పల్లకీలో కొండదిగువన ఉన్న ఉద్యానవనానికి తీసుకుకొచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెండి సింహాసనంపై నవదంపతులను, మరో వేదికపై పెళ్లి పెద్దలైన సీతారాములను ఆశీనులు గావించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం చతుర్వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం కొండపైకి తీసుకెళ్లారు.



సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి
నక్షత్ర మాల విరమణ



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసకిరణ్

అంతర్వేది, మే 11(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన స్వయంభు కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి నక్షత్ర మాల విరమణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఏప్రిల్ 13, 14 తేదీల్లో స్వామివారి మాల ధారణ చేసిన భక్తులు 27 రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షచేసి నృసింహస్వామి జయంతిరోజు గరుడముడిని శిరస్సున ధరించి ఆలయానికి వచ్చి సమర్పించారు. ఉదయం 8 గంటల నుంచి నక్షత్ర మాల దీక్షాధారులతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, ఆలయ స్థానాచార్యుల వి.రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకుడు జి.రాజేష్ ఆధ్వర్యంలో విశ్వక్షేన పూజ, పుణ్యహవచనం, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ఠాపన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. దీక్షాధారులతో ప్రత్యేక పూజలు చేయించి దీక్ష విరమణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దీక్ష ధరించిన స్వాములతో కలిసి ఆలయ కల్యాణ మండప షెడ్డులో ఏర్పాటుచేసిన మహాశాంతి హోమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు హోమంలో పూర్ణాహుతి నిర్వహించి భక్తులందరితో హోమ ద్రవ్యాలను హోమగుండంలో వేయించారు.



స్వామివారి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న స్వాములు, అర్చకులు, అధికారులు

ఘనంగా నృసింహ జయంతి

సాయం సంధ్యవేళలో పుట్టిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి రోజూ ఉదయం అభిషేకం, హోమం, మాఘమాసంలో కల్యాణం నిర్వహిస్తారు. ఒక నృసింహ జయంతి రోజున మాత్రమే సాయంత్రం 6 గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు అర్చకుల ఆధ్వర్యంలో జరుగుతాయి. స్వామివారి నిజరూప దర్శనం ఉదయం, సాయంత్రం నృసింహ జయంతి రోజున మాత్రమే భక్తులకు కల్పిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అష్టోత్తర శత కలశాభిషేకాలు చేసి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నృసింహ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



ఇరుముడి సమర్పించడానికి వచ్చిన స్వాములు

ఏపీ ఈఏపీసెట్‌కు 3,61,299 దరఖాస్తులు

- ఇంజనీరింగ్‌కు 2,79,538, అగ్రికల్చర్ ఫార్మసీకి 80,849
- ఈ నెల 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహణ
- నేటి నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ : కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఏపీ ఈఏపీసెట్-2025కు ఇప్పటివరకు 3,61,299 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,79,538, అగ్రికల్చర్ ఫార్మసీకి 80,849... రెండింటికీ 912మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. రూ.4 వేలు అపరాధ రుసుముతో ఈ నెల 12 వరకు, రూ.10వేలు అపరాధ రుసుముతో ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లను సోమవారం నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 నెంబరు ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వారికి కేటాయించిన పరీక్ష కేంద్రం రూట్ మ్యాప్ తెలుసుకునేందుకు హాల్ టికెట్ చివరి పేజీలో గూగుల్ మ్యాప్ ఇచ్చామన్నారు. పరీక్ష కేంద్రం పూర్తి చిరునామాను https://cets.apsche.ap.gov.in/eapcet/EAPCET_Centers.aspx ద్వారా తెలుసుకోవడంతో పాటు గూగుల్ మ్యాప్ పొందవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2359599, 2342499 నెంబర్లలో కానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సూచించారు.



కన్వీనర్ సుబ్బారావు

175 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

మంత్రి వాసంశెట్టి సుభాష్



పి.గన్నవరం హైస్కూల్లో విద్యార్థులకు నియామక పత్రాలను అందిస్తున్న మంత్రి సుభాష్

పి.గన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్తను చూడాలనే ముఖ్య ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు రాష్ట్రంలో 175 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. వైసీపీ హయాంలో నిరుద్యోగులను కల్తీ మందు, గంజాయి వైపు మళ్లించి వారి భవిష్యత్తుతో ఆటలాడుకున్నారని, జగన్ మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, గిడ్డి శ్యామలరాణి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా పి.గన్నవరం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ప్రతీ నియోజక వర్గంలో జాబ్‌మేళాలు ఏర్పాటు చెయ్యడంతో పాటు డీఎస్సీలో 16,450 పోస్టులు భర్తీకి నోటిఫి కేషన్ జారీ చేసిందన్నారు. రాబోయే రెండేళ్లలో 2 నుంచి 3 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. మొదటి విడతగా మే 1న సుమారు 35 నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. ఈక్రమంలోనే కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో రూ.11.05 కోట్లతో ఏర్పాటు చెయ్యనున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన జరిగిందని తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, హోసూరులలో అప్రెంటిస్షిప్ ట్రైనీకి ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందించారు. తొలుత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హైస్కూల్ ఆవరణలో ఉన్న సరస్వతిదేవి, వివేకనందుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జాబ్‌మేళాను ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరావు, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, వాసంశెట్టి కుమార్, చొల్లంగి సత్యనారాయణ మూర్తి,నక్కా సత్యనారాయణ తదితరులున్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన తిగిరిపల్లి విద్యాసాగర్(18)ఆదివారం బైక్‌పై కాపవరం వెళ్లి తిరిగి వస్తుండగా ఎస్‌టర్నింగ్ వద్ద పంగిడి వైపు వెళ్తున్న గడ్డిట్రాక్టర్ ఢీకొంది. విద్యాసాగర్ బైక్‌పై నుంచి కింద పడి తల, నడుముకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి అరవిందకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్టు తెలిపారు.



ట్రాక్టర్ చక్రాల కింద ఉన్న బైక్

పెళ్లి కబుర్లకు బయలుదేరి..

ట్రాలీ లారీ ఢీకొని వ్యక్తి మృతి



రాంబాబు (ఫైల్‌ఫొటో)



ప్రమాదంలో నుజ్జునుజ్జుఅయిన ద్విచక్రవాహనం

తుని రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కబుర్లకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన ఘటన 16వ నెంబరు జాతీయ రహదారి కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో జరిగింది. తుని రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం.. బూరాడ రాంబాబు (38) తన అన్నయ్య కుమార్తె పెళ్లి కబుర్లు చెప్పేందుకు విజయవాడ రాణిగారి తోట ఏరియా నుంచి శ్రీకాకుళం జిల్లా రామన్నపేటకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. తేటగుంట చేరుకునేసరికి వెనుక నుంచి రాంబాబు ద్విచక్రవాహనాన్ని ట్రాలీ లారీ బలంగా ఢీకొని ద్విచక్రవాహనంతో 200మీటర్లు లాక్కుని వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పక్కనే ఉన్న కెమెరాల ఆధారంగా ప్రమాదానికి గల కారణాన్ని అన్వేషించి లారీని పట్టుకుని కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విజయవాడలో క్యాటరింగ్ పనులు నిర్వహిస్తూ జీవన ఉపాధి పొందుతున్నట్టు, పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐకృష్ణమాచార్యులు చెప్పారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన భాస్కర్‌రావు

ఎటపాక, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేట వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సీతాపురం గ్రామానికి చెందిన అల్లాడి భాస్కర్‌రావు (62) బైక్‌పై టేబుల్ ఫ్యాన్ పెట్టుకుని భద్రాచలం వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో భద్రాచలం నుంచి సీఆర్‌పీ ఎఫ్ జవాన్లతో చింతూరు వైపు నుంచి వస్తున్న చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో భాస్కర్‌రావుకు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో...



వెంకటరమణ మృతదేహం

కడియం, మే 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం కాలువ గట్టున ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన గుబ్బల వెంకటరమణ (40) మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. వెంకటరమణ గాలంతో చేపలు పట్టుకుని విక్రయించి జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 10న చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లే వారు అతడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా వెంకటరమణకు ఫిట్స్ వస్తుంటాయని కుటుంబ సభ్యులు తెలిపినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

ఆలమూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల హైవే పక్కన ఉన్న సైడ్ డివైడర్‌ను ఆదివారం బైక్‌తో ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడుకు చెందిన కొత్తపల్లి ఆనంద్ (30) చిలకలపాడు నుంచి రావులపాలెం వైపు వెళ్తుండగా చొప్పెల్ల లాకుల సమీపంలో అదుపు తప్పి సైడ్ డివైడర్‌ను బలంగా ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందినట్టు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. ఆనంద్ రాజమహేంద్రవరంలోని ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భోజనం ప్యాకెట్లు తీసుకెళ్తుండగా..
ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

గొల్లప్రోలు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం సమీపంలో ట్రాక్టర్ ఢీకొని యువకుడు మరణించాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం మత్స్యపురం గ్రామానికి చెందిన కోడా మోహన్ (22) గొల్లప్రోలు మండలం లక్ష్మీపురంలో యాళ్ల వెంకటరమణ చేపల చెరువులో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కూలీలకు భోజనం తెచ్చేందుకు చేబ్రోలు శివారు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని మెస్‌కు బైక్‌పై వెళ్లాడు. భోజనం ప్యాకెట్లు తీసుకుని చేబ్రోలు-ఏకే మల్లవరం రోడ్డులో వెళ్తుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో మోహన్ అక్కడిక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్కంఠభరితంగా...

పిఠాపురంలో తైక్వాండో పోటీలు
పాల్గొన్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పిఠాపురంలో తలపడుతున్న క్రీడాకారులు

పిఠాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని భాష్యం స్కూలు ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో పోటీలు ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉత్కంఠభరితంగా జరిగాయి. 200 మందికి పైగా క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభను నిరూపించుకునేందుకు పోటీపడ్డారు. ఓవరాల్ చాంపియన్లుగా పిఠాపురం క్రీడాకారులు నిలవగా, రెండోస్థానంలో కాకినాడ, మూడో స్థానంలో అమలాపురం క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రామన్నరాజు, సభ్యులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, చైతన్య, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. విజేతలను భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు అభినందించారు.



చాంపియన్‌షిప్ గెలుచుకున్న క్రీడాకారులు

జేఎన్టీయూకేలో 'రీసెర్చ్ కాన్‌క్లేవ్' సదస్సు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాగ్నోల్యాబ్స్ సీఈవో యోగేశ్వరరావు

జేఎన్టీయూకే, మే11 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే అలూమ్ని ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ పరిశోధన అభివృద్ధి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రీసెర్చ్ కాన్‌క్లేవ్-2025 సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని కాగ్నో ల్యాబ్స్ సీఈవో డాక్టర్ ఎం.యోగేశ్వరరావు పాల్గొనగా జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ చైర్మన్‌గా, వర్శిటీ పరిశోధనా అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించగా ప్రిన్సిపాల్స్ మోహన్‌రావు, శ్రీనివాసరావులు కోకన్వీనర్లు, డైరెక్టర్లు ఎ.గోపాలకృష్ణ, ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, బీటీ కృష్ణ సమన్వయకర్తలుగానూ వ్యవహరించారు. యోగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సుకత నుంచి లక్ష్యంవరకూ పరిశోధనాశక్తి అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రీసెర్చ్‌స్కాలర్స్‌కు అవగాహన కల్పించారు. పరిశోధనా విభాగానికి సంబంధించి పేపర్ ప్రజంటేషన్‌లో 2017, 2022లో ప్రపంచవ్యాప్తంగా చైనా, అమెరికా దేశాలు మొదటి, రెండు స్థానాల్లో ఉండగా 1,91,590 పేపర్లతో భారతదేశం 4వస్థానంలో నిలిచిందని తెలిపారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ వర్శిటీలో త్వరలో రీసెర్చ్‌స్కాలర్స్‌కు కేంద్రీకృత పరిశోధన, లైబ్రరీ సదుపాయం, మౌలిక వసతుల కల్పన, మ్యాట్ ల్యాబ్ కల్పిస్తామన్నారు. రీసెర్చ్ కాన్‌క్లేవ్‌కు 210మంది హాజరుకాగా వారిలో 110 మంది పోస్టర్ ప్రజంటేషన్ ఇవ్వడం జరిగిందని డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ ఉప కులపతులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

ఏపీ జెన్కో హైడల్ చీఫ్ ఇంజనీర్ పర్యటన

మోతుగూడెం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ సివిల్ (హైడల్)గా ఉద్యో గోన్నతి పొందిన రవీందర్‌రెడ్డి ఆదివారం తొలిసారిగా లోయర్ సీలేరు పరిధిలోని పొల్లూరు, డొంకరాయి ప్రాజెక్టులను సందర్శించారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ నూతనంగా చేపట్టిన 5, 6 యూనిట్ల పనులను పరిశీలించారు. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల పొడవున్న పవర్ కెనాల్‌ను పరిశీలిస్తూ డొంకరాయి ప్రధాన ఆనకట్టకు చేరుకున్నారు. డొంకరాయి ఏపీ జెన్‌కో అధికారులు రవీందర్ రెడ్డికి సాదర స్వాగతం పలికారు. ప్రధాన ఆనకట్ట, 25మెగావాట్ల మినీ పవర్‌హౌస్, శాండిల్ పికప్ డ్యాములను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పర్యటనలో ఎం.శేఖర్ (ఎస్ఈ సివిల్, విద్యుత్ సౌధ విజయవాడ), లోయర్ సీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, డొంకరాయి జెన్‌కో అధికారులు, ఏఈలు శివశంకర్, విజయ్‌పాల్, మురళీకృష్ణ ఉన్నారు.



పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

బాగు చేయండి..లేదా కూల్చేయండి

- శిథిలావస్థలో బిక్కవోలు పాత వంతెన
- ప్రమాదాల బారిన పడుతున్న పాదచారులు, వాహనదారులు



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన బిక్కవోలు పాత వంతెన

బిక్కవోలు, మే 11(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని సామర్లకోట కెనాల్‌పై బ్రిటీషు వారి హయాంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. రాకపోకలకు అనువుగా లేకపోవడంతో ఈ వంతెన పక్కన 1995లో కొత్త వంతెన నిర్మించారు. అయితే పాత వంతెనను పూర్తిగా తొలగించక అలాగే ఉంచడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వాడుతున్నారు. వంతెనకు ఇరువైపులా రైలింగ్ వద్ద వున్న రోడ్డు కాలువలోకి జారిపడి పెద్ద, పెద్ద గోతులు పడ్డాయి. వంతెన మధ్య భాగంలో మాత్రమే నడవడానికి రోడ్డు వుంది. దీంతో బయట వారు ఈ వంతెనపై గ్రామంలోకి వస్తుంటే వారు ఈ గోతుల నుంచి కాలువలోకి జారిపడి ప్రమాదాల పాలవుతున్నారు. మూడేళ్ల కిత్రం షష్ఠి ఉత్సవాలకు వచ్చిన ఓ యువకుడు ఈ వంతెన నుంచి కాలువలోకి జారి పడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టి పాదచారులు నడవడానికి అనువుగా తయారు చేయాలని, లేని పక్షంలో పూర్తిగా తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సాధారణ బదిలీల్లో ప్రాధాన్యం కల్పించాలి

డైట్‌లో పనిచేసిన హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే సాధారణ బదిలీల్లో తమకు తొలి ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని గత ప్రభుత్వంలో డైట్‌లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు విద్యాశాఖా మంత్రి లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ గత వైసీపీ ప్రభుత్వంలో 2020లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 జిల్లా విద్యాశిక్షణా సంస్థల్లో రెగ్యులర్ లెక్చరర్లు లేనందున డైట్‌లను బలోపేతం చేసేందుకు సీనియార్టీ ప్రాతిపదికన తమను డిప్యూటేషన్‌పై నియమించినట్టు తెలిపారు. ఎలాంటి ఆర్థికపరమైన ప్రయోజనాలు ఆశించకుండా నాలుగు సంవత్సరాల నుంచి డైట్‌లలో సేవలు అందించిన తమను ఈ ఏడాది ఏప్రిల్ 23న ఉన్నపళంగా మాతృసంస్థలకు తిరిగి పంపించారని పేర్కొన్నారు. అయితే తమ పూర్వపు స్థానాల్లో వేరే ఉపాధ్యాయులతో భర్తీ చేయడంతోపాటు తమకు ఇచ్చిన ఉత్తర్వుల్లో నియర్ బై అని పేర్కొన్నారని, తమకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. ఓల్డ్ స్టేషన్ పాయింట్లు, డైట్‌లో పనిచేసిన కాలానికి కూడా పాయింట్లు ఇవ్వలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే సాధారణ బదిలీల్లో తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

పీఎంపీలకు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, మే11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎఫ్‌కెఫ్ రెస్టారెంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎంపీలకు కండరాలు, ఎముకలు, కీళ్లను ప్రభావితం చేసే క్యాన్సర్‌లపై ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాదు క్యాన్సర్ సెంటర్‌కు చెందిన అంకాలజిస్ట్ డాక్టర్ కిషోర్ ఎముకలు, కండరాల క్యాన్సర్‌కు గల కారణాలు, లక్షణాలు, రోగ ని ర్థారణ, చికిత్సలను తెలియజేశారు. క్యాన్సర్లు వ్యక్తి జీవన నాణ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, వీటిపై అవగాహన పొందడం అవ సరమన్నారు. కార్యక్ర మంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, తోరాటి ప్రభాకరరావు, గంగుమళ్ల రాంబాబు రహమాన్ ఖాన్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



కొంతమూరు ఈఏఆర్ ఎయిడెడ్ స్కూల్ 2009-10 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్, మే11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతమూరు ఈఏఆర్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2009-10 విద్యా సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అదే పాఠశాల ప్రాంగణంలో జరిగింది. పూర్వ విద్యార్థుల తమ కుటుంబ సభ్యులతో కలసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాడు తరగతి గదిలో చేసిన అల్లరి పనులను, మధుర సంగతులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. తమకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పించి తమను ఉన్నత స్థితిలో స్థిరపడేలా చేసిన హెచ్‌ఎం కె.ప్రభాకరరావు, ఉపాధ్యాయులను పేరుపేరునా గుర్తు చేసుకున్నారు. అప్పటి హెచ్‌ఎం ప్రభాకరరావును ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనానికి ఏలూరి సాయికృష్ణ, సునీల్, డి.నాగమణి, ఎస్.చండీప్రియ కృషి చేశారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రంగంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12నుంచి 19 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ బి.హేమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 344 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

సీతానగరం, మే 11(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వంగలపూడి గ్రామానికి చెందిన ఆకుమూరి జ్యోషి ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై సీతానగరం వెళుతుండగా ఏటిగట్టు రోడ్డులోని గుంతల్లో ఇసుక పేరుకుపోయి ఉండడంతో ఆ గోతిలో పడిన బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో జ్యోషికి తల, ముఖంపై తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ లక్ష్మణ్ ప్రథమ చికిత్స అందజేసి వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. వంగలపూడి ఇసుక ర్యాంపు నుంచి లారీలు, ఉచిత ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. అధిక లోడ్‌తో వాహనాలు వెళుతుండడంతో రోడ్డుపై ఇసుక పడి గుంతలు కనిపించడం లేదు. దీంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించాలని కోరుతున్నారు.

కారు ఢీకొని తల్లీకొడుకులకు గాయాలు

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని తల్లీకొడుకులకు గాయాలైనట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. ఈనెల 10న సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన కందుల మహేష్‌బాబు, తల్లి లలితతో బైక్‌పై తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేటు వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోవడంతో గాయాలపాలయ్యారు. చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు మహేష్‌బాబు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

వివాహిత అదృశ్యం



రంగంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదైనట్లు రంగంపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కేవీఎస్ నారాయణ ఆదివారం తెలిపారు. మండలంలోని ఈలకొలను గ్రామానికి చెందిన 24 ఏళ్ల కురుకూరి పూజిత, శివయ్య భార్యాభర్తలు. వారికి ఒక పాప ఉంది. శివయ్యకు మాటలు రావు. లైటింగ్ పనికి వెళుతుంటాడు. ఈ నెల 9వ తేదీ రాత్రి భోజనం చేసి అందరూ పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం పూజిత అత్తగారు అనంతలక్ష్మి లేచి చూసేసరికి పూజిత కనిపించలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో అనంతలక్ష్మి శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు. యువతి ఆచూకీ తెలిసిన వారు అనపర్తి సీఐ 94407 96538, రంగంపేట ఎస్.ఐ 94409 04854 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు.

కోనేరులో గుర్తుతెలియని మృతదేహం



కోరుకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ గ్రామ శివారు దేవుని కోనేరులో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 45 ఏళ్ల ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. వీఆర్వో కొవ్వాడ రామకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. మృతదేహన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మూగజీవాల మిత్రుడు

- రంపయర్రంపాలెం-తిరుమలాయపాలెం రోడ్డులో నీటితొట్టెలు
- గోపాలమిత్ర సేవా తత్పరత
- అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్న చిరుద్యోగి



రంపయర్రంపాలెం-తిరుమలాయపాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన తొట్టెలో నీటిని నింపుతున్న వెంకటేశ్వరరావు





రంపయర్రంపాలెం-తిరుమలాయ పాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు

గోకవరం, మే 11(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా సూర్యుడు భగభగలాడుతున్నాడు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండ వేడిమిని మనుషులు, మూగ జీవాలు తట్టుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా పశుపక్ష్యాదులు తాగునీటి కోసం అలమటిస్తున్నాయి. ఎంత దూరమైన వెళ్లి దప్పిక తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తాగునీటి కోసం మూగజీవాలు చేస్తున్న అన్వేషణను కళ్లారా చూసి చలించిపోయిన ఓ చిరుద్యోగి వాటి దప్పిక తీర్చేందుకు తనవంతు సహకారం చేస్తున్నాడు. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన గంటా వెంకటేశ్వరరావు పశుసంవర్థకశాఖలో గోపాలమిత్రగా కొన్నేళ్ళుగా పని చేస్తున్నాడు. అతడికి మూగజీవాలంటే ఎనలేని ప్రేమ. ఇతను నివసించే స్వగ్రామాన్ని ఆనుకొని తిరుమలాయపాలెం వెళ్లే దారిలో దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఆప్రాంతంలో ఉన్న నీటికుంటలు, చెరువులు అడుగంటిపోవడంతో మూగజీవాలు తాగునీటి కోసం అలమటిస్తున్నట్టు గుర్తించాడు. వెంటనే సొంత డబ్బులతో సిమ్మెంట్ తొట్టెలను సిద్ధం చేశాడు. రంపయర్రంపాలెం-తిరుమలాయపాలెం రోడ్డులో నీటితొట్టెలు ఏర్పాటు చేసి వాటిని నీటితో నింపుతున్నాడు. సుమారు వందకు పైగా సిమ్మెంట్ తొట్టెలను ఏర్పాటు చేశాడు.

ప్రతీ రోజు సైకిల్‌పై వాటర్ టిన్ తీసుకెళ్లి తొట్టెలను నింపుతున్నాడు. తొట్టెల్లో నీటిని అనేక రకాల మూగజీవాలు తాగి దప్పిక తీర్చుకుంటుంటే అది కళ్లారా చూస్తున్న వెంకటేశ్వరరావు ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. కోతులు, ఉడతలు, దుప్పిలు, అడవి పందులతోపాటు వివిధ రకాల వన్యప్రాణులు ఈనీటిని తాగి సేద తీర్చుకుంటున్నాయి. సుమారు నాలుగేళ్ల నుంచి ఈ విధమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు వెంకటేశ్వరరావు చెబుతున్నారు. అయితే వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టెలను కొంతమంది వ్యక్తులు దొంగిలించడం పట్ల వెంకటేశ్వరరావు అసహనం వ్యక్తం చేస్తున్నాడు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో ఆదివారం ఇద్దరికి రూ.12 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 84 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.1.46 కోట్లు అందించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా వుండాలని సీఎం చంద్రబాబు కోరుకుంటున్నారన్నారు. ఇంకా నగరంలో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారు 75 మంది ఉన్నారని అందరికీ రెండు నెలల్లో నిధులు మంజూరవుతాయన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిని ప్రతీ 15 రోజులకు ఒక సారి సందర్శించి అక్కడ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులూ క్రమశిక్షణతో ఉండాలి



రామకృష్ణ మఠంలో తల్లిదండ్రులకు మార్గదర్శకం చేస్తున్న స్వామిజీ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ మఠంలో ఆదివారం విద్యార్థుల సమగ్ర ఎదుగుదల, చక్కని శీలనిర్మాణం, వ్యక్తిత్వ వికాసం కోసం చేసే కృషిలో భాగంగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. స్వామి సేవ్యానందజీ మహరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు తల్లి తొలి గురువని, సత్యం,ధర్మం, మానవతా విలువల ఔన్నత్యాన్ని పిల్లలకు అలవడేలా చూడాలని భగవాన్ శ్రీరామకృష్ణ, శ్రీశారదాదేవి, స్వామి వివేకానంద జీవితాంశాల ద్వారా తెలియజేశారు. స్వామి పరిజ్ఞాయానందజీ మహరాజ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు క్రమశిక్షణలో ఉంటేనే పిల్లలకు కూడా క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పిల్లలకు సానుకూల దృక్పథం, నైతిక విలువలు అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వామి శశికాంతానందజీ, న్యాయవాది పద్మావతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఏపీ ప్రభుత్వ జిల్లా ఉద్యోగుల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా సమావేశం రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో జరుగుతుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని శాఖల, అన్ని కేడర్ల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం తమ సంఘం పనిచేస్తోందన్నారు. ఉద్యోగుల సమస్యలపై జరిగే సమావేశానికి జిల్లాలోని సంఘ సభ్యులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంలో రచయితల సమావేశం



టౌన్‌హాల్లో రచయితల సమావేశం దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం టౌన్‌హాల్లో ఆదివారం కళా గౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో రచయితల సమావేశం జరిగింది. ప్రారంభ గీతాన్ని ఎస్‌కేఆర్ కళాశాల తెలుగు ఉపన్యాసకురాలు కేఎస్ అన్నపూర్ణాదేవి ఆలపించగా బీవీఎస్ మూర్తి తొలిపలుకులు పలికారు. రచయితలు అనేక సాహిత్య విషయాలను, కవితలను వినిపించారు. భారత వీరుల గొప్పదనం, ఆపరేషన్ సిందూర్, కాశ్మీర్‌లో పాక్ చేసిన దురంతం తదితర అంశాలపై కవులు తమ కవితలను ఆలపించి శ్రోతలను అలరించారు. కృష్ణమోహన్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో కవులు యార్లగడ్డ మోహనరావు, బీహెచ్ రమాదేవి, పీవీబీ సంజీవరావు, మల్లెమొగ్గల వెంకటేశ్వరరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సిందూర్ విజయవంతంపై ఆలయంలో పూజలు



రంగంపేటలో పూజలు చేయిస్తున్న బీజేపీ నాయకులు

రంగంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశం పాకిస్తాన్‌పై చేసిన యుద్ధం ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ప్రతి గ్రామంలో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఆదివారం రంగంపేటలోని కోదండరామాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు మైలవరపు సాయిరామ్ ఆధ్వర్యంలో దేశంపై జరిగిన దాడికి ప్రజలకు భగవంతుడు ధైర్యం, శక్తి ప్రసాదించాలని, జవాన్‌లందరికీ సంపూర్ణ ఆరోగ్యం, ఆయుష్షు కలగాలని కోరుకుంటూ అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. జై జవాన్, జై భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సుదర్శన నారసింహ హోమం

దివాన్‌చెరువు, మే 11(ఆంధ్రజ్యోతి): మన దేశ త్రివిధ దళాలు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ దివాన్‌చెరువులో సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మీగణపతి ఆలయం వద్ద అర్చకుడు పి.సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ హోమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి, పాకిస్తాన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో పాక్‌పై మనదేశం విజయం సాధించాలని, దేశ సైనికులు క్షేమం, భారతదేశ సౌభాగ్యం కోరుతూ ఈహోమం నిర్వహించామని చెప్పారు. పలువురు స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



దివాన్‌చెరువులో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

గిట్టుబాటు ధర కల్పిస్తే రైతుకు కష్టాలుండవు

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణకు నాగలి, వరికంకుల కుచ్చును అందజేస్తున్న చంటి

కడియం, మే 11(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటను అమ్ముకోవడానికి కష్టపడతాడని, ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులకు కష్టాలు ఉండవని సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. చంటి, తనయుడు కృష్ణ ఆయనకు మొక్కను అందించి స్వాగతించారు. అలానే నాగలిని, వరికంకుల కుచ్చును అందజేశారు. 1931లో చంటి పూర్వీకులు కట్టించిన ఇంటిని ఇటీవల అధునాతంగా తయారుచేశారు. ఆ ఇంటిని లక్ష్మీనారాయణ చూశారు. అనంతరం గ్రామంలో గొంతాలమ్మ, ఆంజనేయస్వామి, రామాలయాలతోపాటు ఓంశాంతి ఆశ్రమాన్ని సందర్శించారు. అనంతరం చంటి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రకృతి వ్యవసాయం వైపు ఆలోచన చేయాలన్నారు. తాను మూడేళ్ల పాటు ధర్మవరం వద్ద 12 ఎకరాలు ప్రకృతి వ్యవసాయం చేశానన్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళా సమరయోధులకు నివాళులు



మహిళామూర్తులను సత్కరించిన దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ మే11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరోద్యమంలో ఇక్కడి మాతృమూర్తులు రాజమండ్రి స్ఫూర్తిని ఘనతలను చాటారని అంధ్ర కేసరి యువజన సమితి మహిళా నాయకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుల పార్కులో ఆదివారం మహిళా సమరయోధులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సమితి మహిళా నాయకులు డాక్టర్ కె.అనూరాధ, ఎంవీ పద్మావతి, కోసూరి చండీప్రియ, మంచిరాజు హేమలత, ముదునూరి వాణిశ్రీ ప్రసంగించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన మహిళామూర్తులు ప్రముఖ చిత్రకారిణి పట్నాల రాధారాణి,నాట్య గురువు రెడ్డి ఉమారాణి, ఆధ్యాత్మిక సేవకురాలు కర్రి రమణమ్మ, పన్నాల లక్ష్మీసంతోషి,వాడ్రేవు ప్రసన్నలక్ష్మిలను సత్కరించారు. ఈ సందర్భంగా మహిళామూర్తుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో దేశిరెడ్డి బలరామనాయుడు, రఘుపాత్రుని సాయిబాబా, దూర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎస్సీ పరీక్షపై అవగాన సదస్సు

డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ రాంబాబు

రాజమహేంద్రవరం అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం మే 13వ తేదీన డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు తెలిపారు. ఈమేరకు ఆదివారం సదస్సు కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో పోటీ పరీక్షల నిపుణులు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సారథ్యంలో ఉదయం పది గంటల నుంచి ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న డీఎస్సీ అభ్యర్థులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డీఎస్సీ పరీక్షకు నిరుద్యోగులు సన్నద్ధం కావడానికి పరీక్షకు కనీసం 90 రోజులు సమయం లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని, అలాగే వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని, జిల్లా అంతటా ఒకే పేపర్ నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కమిటీ సభ్యులు టి.రాజేష్, జే.సూరిబాబు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం నాలుగో ఎస్ఐగా సత్యనారాయణ



రాజానగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీసు స్టేషన్ ఎస్ఐగా ఏకే సత్య నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న ఈయన పదోన్నతిపై రాజానగరం ఎస్ఐగా విధులు చేపట్టారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌తో పాటు ముగ్గురు ఎస్ఐలు ఇప్పటికే విధులు నిర్వర్తిస్తుండగా, సత్యనారాయణ నాలుగో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

మంత్రి దుర్గేష్ పరామర్శ

ధవళేశ్వరం, మే 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందిన జనసైనికుడు రంకిరెడ్డి వెంకటేష్(28)కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పరామర్శించారు. ఆదివారం ధవళేశ్వరంలోని వెంకటేష్ నివాసానికి విచ్చేసి అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట సీఐ టి.గణేష్, జనసేన నాయకుడు యడ్ల మహేష్, జనసైనికులు ఉన్నారు.


స్వర్ణాంధ్రలో మాతృ దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు గుబ్బల రాంబాబు మాతృమూర్తికి వందనం పేరుతో ఆశ్రమంలో ఉంటున్న మాతృమూర్తులందరినీ సత్కరించి, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: శుభం
సూర్యమినీ	: సారంగపాణి జాతకం
సూర్యప్యాలస్	: తుడరుమ్
స్వామి	: హిట్-3
శివజ్యోతి	: హిట్-3
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఓదెలా-2
రాజా	: హిట్-3
ఊర్వశి	: జగదేక వీరుడు అతిలోక సుందరి
రంభ	: 6 జర్నీ కామన్ మ్యాన్ పెళ్లాం
మేనక	: అర్జున్ S/O వైజయంతి
అప్సర	: సింగిల్
కుమారి	:సింగిల్
అశోక	: రెట్రో
వీఎస్ మహల్(నామవరం)	: హిట్-3
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: సింగిల్
వెంకటసూర్య(కడియం)	: హిట్-3
సత్యగౌరి (అనపర్తి)	: సింగిల్
సూర్యశ్రీ (అనపర్తి)	: హిట్-3
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: హిట్-3
రామకృష్ణ(కోరుకొండ)	: ----
గీతాసినిమాస్ (సీతానగరం)	: హిట్-3
శ్రీనివాస (గోకవరం)	: సింగిల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: హిట్-3
లలితామహల్(రంపచోడవరం)	: హిట్-3
నవయుగ(చింతూరు)	: ----



రాజమహేంద్రవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 41.0 (ఆదివారం)
కనిష్ఠం : 26.0

1100 డయల్ చేసినా ఫిర్యాదులు నమోదు
నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు 1100 మీ కోసం కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే.. ఫిర్యాదు నమోదు..అర్జీస్థితిగతులు తెలుసుకో వచ్చని తెలిపారు.జిల్లాలో డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.సత్వర పౌర సేవలకు ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నెంబరు 95523 00009ను తమ సెల్ ఫోన్‌లో నిక్షిప్తం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీటితీరువా తదితర పన్నుల చెల్లింపులు కూడా వాట్సాప్ గవర్నెర్స్ ద్వారా చెల్లించే అవకాశం ఉంద న్నారు. రెవెన్యూ పరమైన సేవలు అందుబాటులోకి రావడం వల్ల అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండానే మీ మొబైల్ ఫోనుకే ఆయా సేవలు అందుబాటులోకి తీసుకురావడం విశేషమన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నిమిషం ఆలస్యమైనా నో
నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

రాజమహేంద్రవరం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.37 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2-30 నుంచి 5-30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 16 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆర్ఐవో ఎన్.ఎస్.వి.ఎల్. నరసింహం తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. మొత్తం 20,466 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, అత్యవసర మందులు వంటి సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షాకేంద్రంలోకి అనుమతించమని, అర గంట ముందుగా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.



కూటమిలో పదవుల పండగ

- ఉమ్మడి జిల్లాకు ఒకేసారి ఆరు పదవులు
- నామినేటెడ్ పదవులు పంపకం
- రాష్ట్రస్థాయి చైర్మన్లుగా నలుగురు
- డీసీసీబీ, డీసీఎంఎస్‌కు ఇద్దరు
- ఎట్టకేలకు వీడిన ఉత్కంఠ
- ఫలించిన ఎదురుచూపులు
- టీడీపీకి 3, జనసేనకు 2, బీజేపీకి 1

ఎదురుచూపులు ఫలించాయి..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆరుగురు నాయకులను నామినేటెడ్ పదవులు వరించాయి. దీంతో ఇప్పటి వరకూ నామినేటెడ్ పదవులపై ఏర్పడిన ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి కేఎస్ జవహర్ నియమితులయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును వరించింది. రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ చైర్మన్ పదవి మండపేటకు చెందిన జనసేన నాయకుడు వేగుళ్ల లీలాకృష్ణను వరించింది. ఇక రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి రంపచోడవరానికి చెందిన చోళ్ల బొజ్జిరెడ్డి (బీజేపీ) నియమితులయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరి ంచింది. తుమ్మల బాబు ప్రస్తుతం కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడిగా ఉన్నారు. తాజా పదవితో తుమ్మలకు మూడు పదవులు వరించినట్లయింది.అటు డీసీఎంస్ చైర్మన్‌గా కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పెచ్చెట్టి చంద్రమౌళికి కేటాయించారు. ఒకేసారి ఆరు పదవులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించడంతో సూపర్ సిక్స్ అంటూ కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కేఎస్ జవహర్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న జవహర్ అనూహ్యంగా 2014లో కొవ్వూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014 నుంచి 2019 వరకు కొవ్వూరు ఎమ్మెల్యేగా, ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేశారు.తదనంతర పరిణామాలతో కొవ్వూరు నుంచి తిరువూరు వెళ్లా రు.2019లో తిరువూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించినా దక్క లేదు.దీంతో పోటీకి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జవహర్ తనయుడు కొత్తపల్లి లాల్ టీడీపీ యువజన విభాగం కార్యదర్శిగా,రాజానగరం నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నారు.ఈ పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

సమసమాజ స్థాపనకు కృషి
సామాజిక న్యాయం అందించడానికి.. సమసమాజ స్థాపనకు కృషి చేస్తా. పీ4 విధానంలో దళితుల అభివృద్ధికి సాధ్యమవుతుందని ఆశిస్తున్నా. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు.
- జవహర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్

ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్‌గా శేషారావు

ఉండ్రాజవరం/నిడదవోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) చైర్మన్‌గా పదవి లభించింది. ప్రభుత్వం ఆదివారం వివిధ కార్పొరేషన్లకు ప్రకటించిన పదవుల్లో శేషారావుకు ఈ పదవి దక్కింది. ఈయన 1965వ సంవత్సరం జూలై 15న వేలివెన్నులో జన్మించారు. బీఏ చదివారు. తొలుత టీడీపీ ఉండ్రాజవరం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 1995లో వేలివెన్ను ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటి సర్పంచ్ ఆరేపల్లి వెంకట్రావు పదవిలో ఉండగా మరణించడంతో శేషారావు ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా కొనసాగారు. 2000 నుంచి 2009 వరకు సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు విజయం సాధించి గ్రామాభివృద్ధికి కృషి చేసారు. 2009లో సర్పంచ్‌గా పదవిలో ఉండగా నిడదవోలు నియోజకవర్గం కొత్తగా ఏర్పడింది. నాడు తొలిసారి నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధిం చి శాసనసభలో అడుగుపెట్టారు. రెండోసారి 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మూడో సారి ఓటమి చెందారు.అప్పటి నుంచి నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఈ పదవి రావడం పట్ల నియోజవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు శేషారావుకు అభినందనలు తెలిపారు.

సంతోషంగా ఉంది..
పార్టీ ఇచ్చిన పదవిని అంకిత భావంతో నిర్వహిస్తా. ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ పదవి రావడం సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు , సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు.
- బూరుగుపల్లి శేషారావు, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్

ఏపీఎస్ఐడీసీ చైర్మన్‌గా లీలాకృష్ణ

మండపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆశలు ఫలించాయి. ఎదురుచూపులకు ఫలితం దక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామానికి చెందిన మండపేట నియోజకవర్గ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది.వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఇంటర్ చదివారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.తొలుత కాంగ్రెస్‌లో ఉన్నారు. 1995-2004 వరకు వల్లూరు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు.రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా 2000 నుంచి 2007 వరకు,పీసీసీ కార్యదర్శిగా 2011 నుంచి 2014 వరకు, మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా 2009 నుంచి 2014 వరకు పనిచేశారు. 2015- 2019 వరకు మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా కొనసాగారు. 2019లో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు.2019లో మండపేట నియో జకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా ఉన్నారు.ముందుగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర సాగు నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం నియమించింది.

సాగునీటి పారుదల అభివృద్ధికి కృషి
సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ లకు ప్రత్యేక ధన్యవాదాలు.నాపై ఎంతో నమ్మ కంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తా.సాగునీరు సరఫరాపై దృష్టి పెడతా. సాగునీటి వ్యవస్థలో మార్పులు చేర్పులపై నిపుణులతో చర్చించి చర్యలు తీసుకుంటా .
- లీలాకృష్ణ, ఏపీఎస్ఐడీసీ చైర్మన్

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరించింది. తొలుత డీసీసీబీ చైర్మన్ పదవికి పిఠాపురం జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినిపించింది.ఆఖర్లో అనుహ్యంగా ఈయనకు పదవి దక్కలేదు. అయి తే ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్‌లాంటి పెద్ద పదవిని మర్రెడ్డి చేపట్టలేరనే వాదన ప్రధానంగా పార్టీ అధినేత వద్ద వ్యక్తమైందని సమాచారం.దీంతో మర్రెడ్డికి అవకాశం చేజారిపోయినట్లయిందని పలువురు జనసేన నేతలు విశ్లేషించారు. అదే సమయంలో కౌడా చైర్మన్ తుమ్మలబాబును పిలిపించి ప్రస్తు తం డీసీసీబీ వందల కోట్ల అప్పుల్లో ఉన్నందున దీన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన విషయాన్ని వివరించి ఈయన పేరును ఖాయం చేసినట్లయింది. ఇదిలాఉంటే తుమ్మలబాబుకు తాజా కుర్చీతో కలిపి మొత్తం మూడు పదవులు చేతిలో ఉండడంపై జనసేన వర్గాలే విస్తుపోతున్నాయి. త్వరలో కౌడా కు కొత్త నేతను ఎంపిక చేస్తారని సమా చారం.కౌడా చైర్మన్ కుర్చీ టీడీపీకి ఇవ్వవచ్చనే ప్రచారం ఇరుపార్టీల్లో వ్యక్తమవుతోంది.

బాధ్యతగా చేస్తా
ఈ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తా. పార్టీ అధిష్టానం ఉంచిన గురుతర బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించగలననే నమ్మకం, విశ్వాసం ఉంది.
- తుమ్మల బాబు

డీసీఎంఎస్ చైర్మన్‌గా చంద్రమౌళి

అమలాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెనుకబడి సామాజికవర్గానికి చెందిన ఆయన్ను ఈ పదవిలో నియమించడం ద్వారా కోనసీమ జిల్లాలోని బీసీ సామాజికవర్గానికి న్యాయం చేసినట్టయింది.చంద్రమౌళి 1964 ఆగస్టు 27న జన్మించారు. బీఏ చదివిన ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి గ్రామ, మండల, ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పదవులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా బీసీసెల్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాలు, ఆ తరువాత రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పలు పర్యాయాలు సేవలందించారు.అల్లవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా మౌళి పనిచేసి టీడీపీ కి విశిష్ట సేవలందించారు. చంద్రమౌళికి బీసీ కోటాలో డీసీఎంఎస్ పదవిని కేటాయించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.ఉమ్మడి జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులతో పాటు మార్కెటింగ్ కార్యకలాపాల ద్వారా వారికి ఉన్నతమైన సేవలను అందించడమే లక్ష్యమని డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి వెల్లడించారు. డీసీఎంఎస్ ఆస్తుల పరిరక్షణ, రైతులకు సేవ అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి

రంపచోడవరం, మే 11(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగపరంగా జ్యుడీషియల్ అధికారాలు కలిగిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత చోళ్ల బొజ్జిరెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం బోలగొండలో కొండరెడ్డి తెగకు చెందిన ఈయన గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయుడిగా తన కెరీర్ ప్రారంభించారు.ఆర్ఎస్ఎస్‌లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామాచేసి 2009 ఎన్నికల్లో బీజేపీ తరపున రంపచోడవరం నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు.అనంతరం బీజేపీలో కీలకంగా ఉంటూ ప్రస్తుతం అల్లూజిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని బొజ్జిరెడ్డికి కేటాయించారు.

సమస్యలు పరిష్కరిస్తా..
గిరిజన హక్కుల పరిరక్షణకు పాటు పడతా.. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి సాగిస్తా.ఈ పదవిని అప్పగించి నందుకు ప్రధాని మోదీ , పురందేశ్వరి, సీఎం చంద్ర బాబుకు కృతజ్ఞతలు.
- చోళ్ల బొజ్జిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్



ఊరేగిన సత్యదేవుడు

అన్నవరంలో ఆదివారం సత్యదేవుడి రథోత్సవం కన్నుల పండువగా సాగింది.. రథంపై ఊరేగుతున్న రత్నగిరివాసుడిని చూసి తరించేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు.. - వివరాలు 8లో

జనంతో మమేకం.. సమస్యలపై చర్చ
ఈ నెల 21 నుంచి 23 వరకూ అధికారుల పల్లె నిద్ర

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చే పథకాలు.. గ్రామాలు,పట్టణాలను తీర్చిదిద్దే కార్యక్రమాలకు రూపకల్పన చేయడంతో పాటు వేగంగా అమల్లోకి తీసుకొస్తున్నారు. దీనిలో భాగమే 'స్వర్ణాంధ్ర సంకల్పం'. ఈ సంకల్పంలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా 'పీపుల్స్ ఫస్ట్(జనమే ప్రధానం)' అనే కార్యక్రమాన్ని తొలిసారిగా రాష్ట్రంలో మొదలు ఆరంభిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని, ప్రజల స్థితిగతులను తెలుసుకోడానికి విడతల వారీగా అన్ని గ్రా మాలు,పట్టణాలకు రాష్ట్ర స్థాయి సీనియర్ అధికారులను ప్రభుత్వం పంపించనుంది.అనంతరం పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక ద్వారా సమస్యలకు పరిష్కారం చూపాలని సంకల్పించింది. 'పీపుల్స్ ఫస్ట్'లో భాగంగా తూర్పు గోదావరిలో తొలి విడతగా 20 గ్రామాలను కలెక్టరు ఎంపిక చేసి ఈ నెల 7న ప్రభుత్వానికి ప్రాథమిక జాబితా పంపించారు. ఈ మేరకు ప్రభుత్వం ఆ గ్రామాల స్థితిగతులను పరిశీలన చేసి అంగీకారం తెలుపుతుంది. అనంతరం ఈ నెల 21 నుంచి 23 వరకూ.. అంటే మూడు పగళ్లు, రెండు రాత్రుళ్లు ఆయా గ్రామాల్లో అఖిల భారత సర్వీసుకు

జిల్లాలో 20 గ్రామాలు ఎంపిక

చెందిన అధికారులు, రాష్ట్ర స్థాయిలో శాఖాధిపతులు బస చేస్తారు. ప్రజలతో మమేకమవుతారు. ఆయా సచివాలయాల పరిధిలో విస్తృతంగా పరిశీలన చేస్తారు. మౌలిక సదుపాయాలు గమనిస్తారు. అక్కడి సమస్యలు, ప్రజల ఇబ్బందులపై చర్చలు నడుస్తాయి. అనంతరం వాస్తవ పరిస్థితులను వారు ప్రభుత్వానికి నివేదిస్తారు.ఈ మేరకు కలెక్టర్లకు ఈ నెల 6న ఆదేశాలు అందాయి. జిల్లాలో తొలి విడతలో మండలానికి ఒకటి చొప్పున గ్రామాలను ప్రాథమికంగా ఎంపిక చేశారు. జిల్లాలో 20 సచివాలయాలు ఉన్నాయి.అనపర్తి మండలం రామవరం, బిక్కవోలు-కొమరిపాలెం2, చాగల్లు- నేలటూరు, దేవరపల్లి-లక్ష్మీపురం, గోకవరం -కృష్ణునిపాలెం(కొత్తూరు, చిన్నూరు, వెంకటాపురం, రామానుజపురం-గిరిజన గ్రామాలు), గోపాలపురం-జగన్నాథపురం, కడియం-కడియం4, కోరుకొండ-కనుపూరు, కొవ్వూరు రూరల్-చిడిపి, కొవ్వూరు అర్బన్- ఆవులవారి వీధి, నల్లజర్ల-తెలికిచర్ల, నిడదవోలు-పురుషోత్తపల్లి, పెరవలి-పెరవలి1, రాజమండ్రి రూరల్ -తొర్రేడు, అర్బన్- బత్తిన నగర్, రాజానగరం -తోకాడ2,రంగంపేట- చంద్రేడు, సీతానగరం-చినకొండేపూడి, తాళ్లపూడి-మలకపల్లి, ఉండ్రాజవరం-కాల్దరి గ్రామాలు ఉన్నాయి.






ఉదయం లేవడంతోనే ఒక టీ పడాల్సిందే.. లేదంటే తెల్లారదు.. ముఖంలో ఆ అలసట కనిపిస్తూనే ఉంటుంది.. ఒక చుక్క పడితే.. ఆ ఛాయ్ చమక్కులే చూడరా బాయ్ అని చిరంజీవి అన్నట్టు ఉంటుంది.. డిమాండ్ ఉండడంతో వీధికో టీ దుకాణం వెలసింది.. ఒక్క రాజమ హేంద్రవరంలోనే ప్రతి రోజూ సుమారు 6 లక్షల మంది టీ తాగుతున్నట్టు సమాచారం.. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లెక్కకు మిక్కిలి ఉంటుంది.. అయితే డిమాండ్‌కు తగినట్టు నకిలీ టీపొడి విచ్చల విడిగా వినియో గిస్తున్నారు. అయినా పట్టించుకునేవారే లేరు.



కల్తీ ఏంటీ
మార్కెట్‌లో నకిలీ టీపొడి

- విచ్చలవిడిగా అమ్మకాలు
- కేజీ రూ.200 మాత్రమే
- చిరు టీస్టాల్స్‌లో వినియోగం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- కన్నెత్తి చూడని అధికారులు
- రాజమండ్రిలో 9 పాయింట్లు

రాజమహేంద్రవరం సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ వ్యాపారం ఎక్కడ చేయగలరు.. ఎక్కడ ఎక్కువ అమ్మకాలు జరుగుతాయో అక్కడే..ఎందుకంటే అంతా సందట్లో సడేమియా.. ఏం చేసినా తిరుగుండదు..అడిగే దిక్కుండదు. తెలిసినా ఊకొడతారు..ఊరుకుంటారు..ప్రస్తుతం రాజమహేంద్రవరంలో అదే జరుగుతుంది. కల్తీ టీ పొడికి అడ్డాగా మారిపోయింది. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో ప్రధాన వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరం..నిత్యం కోట్లలో వ్యాపారలావాదేవీలు సాగుతాయి.కనీసం కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. దీంతో నకిలీ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.



ప్రధాన వాణిజ్య కేంద్రంలో..

రాజమహేంద్రవరం హోల్‌సేల్ వ్యాపారానికి ప్రసిద్ధి.మార్కెట్‌పై వ్యాపారులకు చాలా నమ్మకం.ఇదే పెట్టుబడిగా కొంత మంది కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెట్‌లోకి దింపి పెద్ద ఎత్తున విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం కల్తీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది. క్షణాల్లో తయారు చేసి ప్యాకింగ్ చేసి ఎటువంటి అనుమానం రాకుండా తరలించేస్తున్నారు.రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో మూడు, ఎస్‌వీజీ మార్కెట్‌లో 6 పాయింట్లలో కల్తీ టీ పొడి తయారు చేసి విక్రయిస్తున్నారు. కల్తీ వ్యాపారం యథేచ్ఛగా సాగుతుంది. సాధారణంగా ఒరిజినల్ టీపొడి ప్యాకెట్ 250 గ్రా ములు కొనాలంటే రూ.200 నుంచి రూ.260 మధ్య ఉంటుంది.కేజీ టీపొడి కోనాలంటే రూ.600 పైనే ఉంటుంది.కల్తీ టీపొడి రూ.150 నుంచి రూ.200 లోపే వస్తుంది. అంతే కాకుండా చిన్న రూ.5 ప్యాకెట్లు అధికంగా తయారు చేసి మార్కెట్‌లోకి దింపుతున్నారు.ప్రజలు నాణ్యత చూడకపోవడం కూడా కల్తీకి కారణం.కల్తీ టీపొడి నియంత్రణలో అధికారులు విఫలమవుతున్నారు.

కల్తీ టీపొడి తయారీ ఇలా

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి చింతపిక్కలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటు న్నారు. వాటిని ఎండబెట్టి టీ పొడి మాదిరిగా ఆడిస్తున్నారు.దానికి జీడీపప్పు పిక్క లోపల ఎర్రని చారతో ఉండే పొరను తీసుకుని దానిని పిండిలా ఆడిస్తున్నారు.అనంతరం ఫుడ్ కలర్స్ కలిపి ఈ మిశ్రమాన్ని చింతపిక్కల పౌడర్‌లో కలిపి వేడిచేసి గచ్చుపై ఆరబెట్టి ఆరిన తర్వాత టీ పొడి ప్యాకెట్లు తయారుచేస్తున్నారు. ఇందులో కలిపే ఫుడ్ కలర్స్, జీడిపిక్కల పొర కారణంగా జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది.ఈ టీ పొడితో కాచిన టీ తాగితే ఖచ్చితంగా జబ్బుపడతారు. ప్రస్తుతం ఈ కల్తీ టీ పొడి తయారీకి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉంది.గతంలో అనపర్తిలో తయారుచేస్తే అప్పటిలో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుట్టుచప్పుడు కాకుం డా నకిలీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది.

వీధికో దుకాణం..

టీస్టాల్స్‌కు కొదువలేదు.. ఉమ్మడి జిల్లాలో ఏ వీధిలో చూసినా ఏదో ఒక మూల టీస్టాల్ కనిపిస్తూనే ఉంటుంది.చాలా టీస్టాల్స్‌లో కల్తీ టీ పొడి వినియోగిస్తున్నారు.ఈ టీ పొడికి కాస్త అల్లం, యాలకుల పొడి తగిలించి సువాసనతో అందించేస్తున్నారు.మంచి రంగు కనిపించడంతో అది కల్తీ అనే సంగతే అంతుపట్టడంలేదు. అప్పుడప్పుడు సంబంధిత అధికారులు,ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు చేసి ఫైన్ వేసినా పెద్దగా పట్టించుకోవడంలేదు. ఫైన్‌లు కట్టేసి నెమ్మదిగా మళ్లీ కల్తీ టీపొడి తయారు చేసుకుని ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు.కల్తీ టీపొడి పట్టుకున్నప్పుడు వారి వ్యాపార లైసెన్సులు రద్దుతో పాటు వారిపై చట్టప్రకారం కఠిన శిక్షలు లేకపోవడం వల్ల అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు స్పందించి నిఘా పెడితే కల్తీ వ్యాపారాలకు చెక్ పడే అవకాశం ఉంది.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు, మే 11(ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీరనివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూలఅలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మవారికి దర్శనం కల్పించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.42,660, అన్నదాన విరాళాల ద్వారా రూ.3920, ప్రసాద విక్రయాల ద్వారా రూ.30,735, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ.65,594, మొత్తం రూ.1,42,909 ఆదాయం లభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.



పశివేదలలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆంధ్రాసుగర్స్ జేఎండీ అచ్చిబాబు

పశివేదలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

● పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆంధ్రాసుగర్స్ ఎండీ అచ్చిబాబు

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) ప్రారంభించారు. మండలంలోని పశివేదల సెంటర్‌లో గ్రామస్థులు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో బీసీ కాలనీలో రూ.14 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఫార్మ్ మెకనైజేషన్ పథకం ద్వారా ముగ్గురు రైతులకు పవర్ టిల్లర్స్ పంపిణీ చేశారు. రూ.2,29,500ల విలువగల పవర్‌టిల్లర్ సబ్సిడీపై అందజేశారు. రూ.లక్ష సబ్సిడీ కాగా, రూ.1,29,500లకు రైతులకు అందించామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుంపల్లి సింహాచలం, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, బేతిన నారాయణ, గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, తుంపల్లి ఆదినారాయణ, వ్యవసాయశాఖ ఏడీ పి.చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

నిడదవోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు విద్యార్థులు నీతి కథలు వినడం, చెప్పడం ద్వారా విజ్ఞానంతోపాటు భావ వ్యక్తీకరణ అలవడుతుందని గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథల బోధనపై అవగాహన కలిగించారు

అశేష భక్తజనమయం...సత్యదేవుని రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

అన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాల్లో నిర్వహించే గ్రామసేవల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవం కనుల పండుగగా జరిగింది. సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను రూ.1.20 కోట్లతో తయారుచేయించిన నూతన టేకురథంపై ఆశీనులు గావించారు. చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు టెంకాయికొట్టి రథోత్సవం ప్రారంభించారు. రథానికి కుంభం పోసి ముందుకు కదిలించారు. తొలిపావంచావద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ఆంధ్రా బ్యాంక్ వరకు వెళ్లి అక్కడ నుంచి సత్యదేవుడి కొండపైకి వెళ్లే టోల్‌గేట్ వరకు కొనసాగి తిరిగి కాంప్లెక్స్ వద్ద నూతనంగా ప్రారంభించిన రథశాలవద్ద ముగిసింది. అశేష భక్తజనంతో అన్నవరం మెయిన్‌రోడ్డు జనసందోహాన్ని తలపించింది. దేవస్థానం ఉద్యోగులు యావన్మంది రథోత్సవంలో పాల్గొనాలని ఈవో ఆదేశాలు జారీచేయడంతో ప్రతిఒక్క ఉద్యోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 3500 కిలోల బరువుతో సుమారు 35 అడుగులుపొడవు కలిగిన ఈ రథం లాగేందుకు సుమారు 50 మంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, నాయీబ్రాహ్మణులు 50మందితో పాటుగా ముందుభాగంలో ట్రాక్టర్, వెనకభాగంలో జెసీబీ సాయంతో ఇబ్బంది లేకుండా ముందుకు కదిలించారు. ఈఈ రామకృష్ణ, ఏఈవో కొండలరావు మైక్ ద్వారా సూచనలిస్తూ కార్యక్రమం కొనసాగించారు. వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు.

నయనానందకరంగా వనవిహారం

ఆదివారం వనవిహార మహోత్సవం నయనానందకరంగా జరిగింది. నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి పల్లకీలో కొండదిగువున ఉన్న ఉద్యానవనానికి తీసుకుకొచ్చారు. వెండి సింహాసనంపై నవదంపతులను, మరో వేదికపై పెళ్లిపెద్దలైన సీతారాములను ఆశీనులుగావించారు.

గోష్పాదేశ్వరస్వామికి బిల్వార్చన



విశేష అలంకరణలో లలితాపార్వతీ అమ్మవారు, గోష్పాదేశ్వరస్వామి

కొవ్వూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో దర్భా నరసింహమూర్తి సౌజన్యంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతిపూజ, గోష్పదేశ్వరస్వామికి లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్షబిల్వార్చన, లక్ష కుంకుమార్చన, నీరాజనం, మంత్రపుష్పాలు అందజేశారు.

హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

నిడదవోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి ఆరోగ్య రక్షణకు మానసిక ప్రశాంతతకు శ్రీరామదూత హనుమాన్ చాలీసా పారాయణం దోహద పడుతుందని హనుమాన్ చాలీసా పారాయణ భక్తబృందం అన్నారు. 108సార్లు హనుమాన్ చాలీసా పారా యణం కార్యక్రమం 108 గృహాలలో నిర్వహి ంచే కార్యక్రమంలో భాగంగా 12వ వారం ఆదివారం నిడదవోలు పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంవద్ద ఘనంగా నిర్వహించారు. ఈ 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణంలో గండికోట సుబ్బలక్ష్మి, వాసంశెట్టి తులసి, వెం కటరత్నం,కిషోర్‌రాజు,జనార్ధనరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే 'గ్రామదర్శిని'

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, మే 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సుదీర్ఘ సమస్యల పరిష్కారం కోసమే గ్రామదర్శిని కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని హుకుంపేటలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికల సమయంలో గ్రామ గ్రామాన తాను స్వయంగా తిరిగినప్పుడు ఎన్నో సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. అంతేకాకుం డా సుదీర్ఘకాలంగా సమస్యలు గ్రామాల్లో తిష్టవేసి ఉన్నాయన్నారు. వాటిని గ్రామస్థుల సమక్షంలో గుర్తించేందుకు కార్యాచరణ రూపొందించటం కోసమే గ్రామదర్శిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. గోపాలపురం పట్టణంలో 73లక్షలతో నిర్మిం చతలపెట్టిన కల్వర్టులు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నామన్నా రు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న వరదనీరు దిగువ ప్రాంతానికి తరలించేం దుకు ప్రణాళికా బద్ధంగా కల్వర్టులు నిర్మిస్తామన్నారు. వీటితోపాటు శ్రీనక్కిర్లమ్మ, సోమాలమ్మ చెరువునుంచి వరదనీరు కిందకు ప్రవహించే విధంగా ఆర్ అండ్‌బీ నిధులు రూ.30లక్షలు మంజూరు చేస్తామన్నారు. వీటితోపాటు కరిచర్లగూడెంలో కోటి 50లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, రూ.30లక్షలతో శివాలయంరోడ్డు నిర్మాణం, రూ.10 లక్షలతో ఎంపీపీ పాఠశాలవద్ద డ్రైనేజీ నిర్మాణం, తదితర పనుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేయించి ప్రణాళికా బద్ధంగా గ్రామీణ ప్రాంత సమస్యలు గుర్తించి దశలవారీగా పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, పార్టీ సీనియర్ నాయకులు హోతా రాజాబాబు, కొర్లపాటి రాము, తెలుగుయువత అధ్యక్షుడు కాట్రగడ్డ సురేశ్, మండల బీసీసెల్ అధ్యక్షుడు నాగరాజు, టీడీపీ గ్రామకమిటీ అధ్య క్షుడు జ్యేష్ట శ్రీధర్, భూరెడ్డి వాసు, బిక్కవోలు నాగేశ్వర రావు, మద్దిపాటి రమేశ్, జ్యేష్ట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని తల్లీకొడుకులకు గాయాలు

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని తల్లీకొడుకులకు గాయాలైనట్లు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. ఈనెల 10వ తేదీన సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన కందుల మహేష్‌బాబు, తల్లి లలితను తీసుకుని మోటారుసైకిల్‌పై తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్ట బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేటు వద్ద వెనుకనుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడిపోవడంతో గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు మహేష్‌బాబు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సాంబమూర్తి తెలిపారు.

మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవం

తాళ్లపూడి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో గ్రామదేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా వైశాఖ పౌర్ణమిరోజున ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అమ్మవారి శిరిబొమ్మతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో. బాణా సంచాతో ఉత్సవం కొనసాగింది. ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు.



మరిడి మహాలక్ష్మి అమ్మవారి శిరిబొమ్మతో గ్రామోత్సవం

'బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఆశయాలను ఆచరించాలి'



వేలివెన్నులో బాబూజగ్జీవన్‌రామ్, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను ఆచరించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు చెప్పారు. మండలంలోని వేలివెన్ను గ్రామంలో నూతనంగా పునర్‌నిర్మాణం చేసిన డాక్టర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ స్మారక భవనంలో ఏర్పాటుచేసిన మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆదివారంరాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శేషారావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ కేంద్ర ంలో అనేక మంత్రిపదవులు చేపట్టి ఎన్నో సం స్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. రక్షణ, వ్యవసాయ తదితర మంత్రి పదవులతో పాటు ఉపప్రధానికి దేశానికిసేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. అదేవిధంగా డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను నేటియువత ఆచరించాలని శేషారావు సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉపసర్పంచ్, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటి అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ బూ రుగుపల్లి శ్రీనివాస్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మండవల్లి రాజేశ్వరరావు, బైపే రాజేశ్వరరావు, దేవానంద్, అనిల్‌కుమార్, కేవీపీ నాయకులు గెడ్డం రవీంద్రబాబు, జగ్జీవన్‌రామ్ అంబేడ్కర్ విగ్రహాల పుననిర్మాణ కమిటి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



అనంతపల్లి హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నల్లజర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లి హైస్కూలులో 2002-03 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. దాదాపు 23 సంవ త్సరాల తర్వాత కలుసుకున్న వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60మంది పూర్వవిద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు చదువులు చెప్పిన గురువులు శివ పార్వతి, పద్మావతి, విమల, వెంకటేశ్వరావు, బాదుషా, కృష్ణమూర్తి, చింతారావు ప్రస్తుత హెచ్‌ఎం హేమంత్‌కుమార్‌లను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో సత్కరించి తమ గురుభక్తి చాటుకున్నారు. తామంతా ఒక్కటయ్యేందుకు కృషి చేసిన పూర్వవిద్యార్థులు భీష్మ, తాళ్ళూరి సాయి మాధురి, గాయత్రి, రత్నకుమారి, సింధూరం, పి.సతీష్, దొంతల శ్రీనివాస్‌లను అభినందిం చారు. విద్యార్థులకు, పాఠ శాలలకు వస్తువులను అందజేస్తామని పూర్వవిద్యార్థులు వెల్లడించారు.

'వైద్యశిబిరం ఏర్పాటుచేయడం అభినందనీయం'



వైద్య శిబిరానికి హాజరైన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో ఆదివారం ప్రాథమిక పాఠశాలలో సుమంత్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఉచితంగా సుమంత్ మల్టీస్పెషాలిటీ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రధానంగా ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు మాట్లాడుతూ సుమంత్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిద్వారా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పేదలకు వైద్యసేవలందించటం ఎంతో అభినందనీయమని డాక్టర్ సుమంత్‌ను అభినందించారు. ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, బళ్లా సూర్యచక్రం, జనసేన నాయకులు గణేష్, ప్రసాద్, శేషు, సత్తిబాబు, మణికంఠ పాల్గొన్నారు.

నేడు బౌద్ధ దమ్మ పీఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఉండ్రాజవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధ దమ్మపీఠంలో ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు వైశాఖ బుద్ధ పూర్ణిమ పర్వదినం సందర్భంగా ప్రత్యేకఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఠం అధిపతి అనాలయో చెప్పారు. ఈ సందర్భంగా బుద్ధవందనం, ధ్యానం, ఆధ్మాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బుద్ధభగవాన్ జీవితానికి సంబందించిన ముఖ్య సంఘటనల బోధనలు ఉంటాయని ఆయన చెప్పారు. భక్తులు పాల్గొని ఆశీర్వాదములు పొందాలని అనాలయో కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెరవలి, మే11 (ఆంధ్రజ్యోతి): కాకరపర్రు శ్రీ వెంకటశాస్త్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-1995 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మసమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 30ఏళ్ల తరువాత మళ్లీ ఒకేచోట కలుసుకోవడం పాత జ్ఞాపకాలను పునర్ నిర్మించుకోవడం, గత సంఘటనలు చర్చించు కోవడం అన్నీ కలసి ఆరోజు మధురానుభూతిగా మారాయి. పిల్లలతోసహా పాఠశాలలో తిరిగి తల్లిదండ్రు లు తమ బాల్య అనుభవాలను పంచుకున్నారు. సమ్మేళనంలో ఆటలు, పాటలు, పాతజ్ఞాపకాలు, కథలు హర్షాతిరేకాన్ని రేకెత్తించాయి. పాఠశాల గురువుల సేవలను గుర్తు చేసుకున్నారు.

సైనికులకు మద్దతుగా మహిళలు పూజలు



శంకరమఠంలో పూజలుచేస్తున్న మహిళలు

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో సైనికులు వీరోచితముగా పోరాడాలని వారికి శక్తియుక్తులు కలగాలని కొవ్వూరు గౌతమీనగర్ శంకరమఠంలో బ్రాహ్మణ సేవాసంఘం మహిళలు పూజలు చేశారు. భారత్-పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యు ద్ధంలో భారత సైనికులకు విజయం వరించాలని కోరారు. కార్యక్రమంలో వారణాసి అలివేలు, వంకా దేవి, రాయప్రోలు కామేశ్వరి, పిల్లలమర్రి వనజ, కృష్ణంపల్లి సీత, మేడూరి కామేశ్వరి, మురళీకృష్ణ, భూషణ్‌శర్మ, కలగ్రశ్రీనివాస్, సత్యనారాయణ, రవితేజ, ధర్మలింగం, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిమాతకు మహా నీరాజనం



గోదావరిమాతకు మహానీరాజనం అందజేస్తున్న పండితులు

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూ రు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరిమాతకు మహా నీరాజనం అందజేశారు. ఆదివారం వైశాఖ పూర్ణిమను పురస్కరించుకుని గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యం లో సమితి 19వ వార్షికోత్సవం, 236వ మాసోత్సవం నిర్వహించారు. ఆదివారం ప్రదోష కాలంలో క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో ఉన్న గోదావరిమాత ఆలయంవద్ద లలితా సహస్రనామ పారాయణం చేశారు. నీరాజన సమితి అధ్యక్షు డు కలిగొట్ల కృష్ణారావు, సరోజిని, రవికిరణ్, భా స్కరశ్రీలక్ష్మి దంపతులు విఘ్నేశ్వరపూజ, గౌత మీ, గోమాతలకు పంచోపచారపూజ, కలశస్థాపన, శ్రీసూక్త విధాన పూజ, అష్టోత్తర శతనామా కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పాలు, మహానీరాజనం, దీపోత్సవం అందజేశారు. అన ంతరం వార్షిక నివేదికను సమర్పించారు. గోదావరినది కలుషితం కాకుండా అపవిత్రం చేయకుండా కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పలువురు కొనియాడారు. యనమండ్ర వేణుగోపాలశాస్త్రి, డా. కోట సూర్యనారాయణమూర్తి, లింగాల శ్రీనివాసశాస్త్రి, అనుపిండి చక్రధరరావు, మురళీకృష్ణ, భైరవమూర్తి, ఉమారామారావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తులసి మొక్కల పంపిణీ



తులసి మొక్కలు పంపిణీ చేస్తున్నదృశ్యం.

పెరవలి, మే 11(ఆంధ్రజ్యోతి):కల్యాణాల వెంకన్న ఖ్యాతి గాంచిన అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్స వాలు నాల్గవరోజు ఆదివారం ఆలయంలో తులసి బృందార్చన నిర్వహించారు. తులసి మొక్కలకు అర్చనలు జరిపి ఆలయ ఈవో మీసాల రాధాకృష్ణ దంపతులు తులసి మొక్కలను భక్తులకు పంపిణీ చేశారు. పెరవలి మండలం అన్నవరప్పాడులో ఉన్న శ్రీ అలివేలు మంగపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అన్నవెంట నే వరాలిచ్చే అన్నవరప్పాడు వెంకన్నగా ఇక్కడ ప్రసిద్ధి చెందిన శ్రీవారిని భక్తులు ఏడు శనివారాలు దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

ట్రాక్టరు ఢీకొని యువకుడి మృతి



ట్రాక్టర్ కిందపడిపోయిన యువకుడు

కొవ్వూరు, మే 11(ఆంధ్రజ్యోతి): ట్రాక్టరు ఢీకొని యువకుడు మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. దొమ్మేరు గ్రామానికి చెందిన తిగిరిపల్లి విద్యాసాగర్(18)ఆదివారం బైక్‌పై కాపవరం వెళ్లి తిరిగి వస్తుండగా ఎస్ టర్నింగ్ వద్ద పంగిడి వైపు వెళుతున్న గడ్డిట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యాసాగర్ బైక్‌పై నుంచి కింద పడిపోవడంతో తలకు, నడుముకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి అరవింద కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ విశ్వం తెలిపారు.